
క్లుప్తంగా

రంగా విగ్రహం ఏర్పాటుకు ఆర్థిక సాయం

కారెంపూడి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదగా శంకుస్థాపన జరిగిన స్వర్గీయ వంగవీటి మోహన్‌రంగా విగ్రహం ఏర్పాటు పనులకు కారెంపూడికి చెందిన మొహమాటం శివబాబు సోమవారం రాత్రి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. దాదాపు రూ.10 లక్షల ఖర్చుతో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో 9 అడుగుల రంగా విగ్రహం ఏర్పాటు చేశారు. దాదాపు పనులన్నీ పూర్తయి త్వరలో విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో శివబాబు రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని వైఎస్సార్ సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య తదితరులకు ఈ సాయం అందించారు.

నేడు అంకమ్మతల్లి దేవాలయం ప్రతిష్ట



దాచేపల్లి : మండలంలోని తక్కెళ్లపాడులో నూతనంగా నిర్మించిన శ్రీ అంకమ్మతల్లి దేవాలయ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం జరగనున్నది. సుమారుగా రూ.2కోట్ల వ్యయంతో ఈ దేవాలయం నిర్మాణం చేపట్టారు. శ్రీ అంకమ్మతల్లి దేవాలయం ప్రతిష్టతో పాటుగా అంకమ్మతల్లి, పోతురాజు స్వామి విగ్రహాల పునఃప్రతిష్ట జరుగుతుంది. అదేవిధంగా శ్రీ సీతారామస్వామి వారి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం కూడా జరుగుతుందని కమిటీ సభ్యులు చెప్పారు. దేవాలయం లోపలి భాగంలో మార్బుల్స్, టైల్స్‌తో తీర్చిదిద్దారు. గర్భగుడిని గ్రానైట్‌తో మెరుగులు దిద్దారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే ప్రతిష్ట పూజ కార్యక్రమాలు జరుగుతాయని, ప్రతిష్ట సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

బడిఈడు పిల్లలను బడికి పంపించాలి



దాచేపల్లి : బడిఈడు పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరుతున్నారు. మండలంలోని మాదినపాడు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పప్పుల పెరాల్సన్, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, నాగుల్‌మీరా తదితరులు మంగళవారం గ్రామంలో పర్యటించారు. బడిఈడు వచ్చిన పిల్లలు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, అవకాశాలను వివరించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్చి భావిభారత పౌరులుగా ఎదిగేందుకు తల్లిదండ్రులు బాటలు వేయాలని వారు కోరారు.

కోచింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ ఉన్నం నాగమల్లిఖార్జున రావు



పిడుగురాళ్ల : యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నికల్, ఏపీఆర్‌జేసీ శిక్షణను ప్రతి విద్యార్థి సద్వినియోగంచేసుకోవాలని డాక్టర్ ఉన్నం నాగమల్లిఖార్జునరావు అన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, లయోలా విద్యా సంస్థలు అందజేసిన స్టడీ మెటీరియల్‌ను ఆయన చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచితంగా విద్యార్థులకు చదువుతోపాటు, మెటీరియల్ వంటివి అందించడం వల్ల వారు ఎంతగానో ప్రయోజనం పొందుతారని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బుర్రి వెంగళరెడ్డి, కౌన్సిలర్ కిరణ్, పీడీ ఇబ్మానియేలు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. విజయసారధి, యూటిఫ్ నాయకులు ఎస్‌కే జమాల్, ఎస్‌కే ఖాశీం పీరా, కె. రామకృష్ణ, మల్లిఖార్జునరావు, శ్రీనివాసరావు, సాంబశివరావు, బాజి, ఉపాధ్యాయులు సాయిబాబా తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాలభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పిడుగురాళ్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిరుద్యోగ యువతి, యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు ఎస్‌వి కృష్ణారెడ్డి తెలియజేశారు. ఉచిత శిక్షణ తరగతులు ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఆయన తెలియజేశారు. అసిస్టెంట్ డేటా ఎంట్రీ రెండు నెలలు వంటి కోర్సులు పదవ తరగతి పైన పాసైన వారికి ఉచిత శిక్షణ సర్టిఫికెట్, ప్లేస్‌మెంట్ కల్పించటం జరుగుతుందని నిర్వాహకులు ఎస్‌వి కృష్ణారెడ్డి తెలియజేశారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతి, యువకలుఉ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

ఎంపీపీ అల్లు సత్యవతి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అల్లు సత్యవతి

పిడుగురాళ్లరూరల్: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ అల్లు సత్యవతి అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలోని సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ అల్లు సత్యవతి అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మండల అధికారులు వారి అభివృద్ధిని సమావేశంలో వివరించారు. ముందుగా తహసీల్దార్ చక్రవర్తి మాట్లాడుతూ మండలంలోని చిన అగ్రహారం, పెద్ద అగ్రహారం గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామని, త్వరలో అన్ని గ్రామాల్లో పూర్తి చేస్తామని తెలియజేశారు. జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య మాట్లాడుతూ కామేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీ చుట్టూ అనేక లే అవుట్ వేస్తున్నారని, అన్నిటికి పర్మిషన్లు ఉన్నాయా లేవా, పంచాయతీ అప్రూవల్ పొందాయా లేదా, పంచాయతీకి ఇవ్వాల్సిన 20 శాతం భూమిని రిజిస్ట్రేషన్ చేస్తున్నారని అని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. తహసీల్దార్ మాట్లాడుతూ లే అవుట్ నిర్మించడంతో రెవెన్యూ పాత్ర కొంత మాత్రమేనని, అది కూడా అగ్రికల్చర్ భూమిని నాన్ అగ్రికల్చర్‌గా మారి కన్వర్షన్ నుంచి పర్మిషన్ ఇవ్వటమే రెవెన్యూ పాత్ర అని, డీటీపీ అప్రూవుల్ అయితేనే పంచాయతీ అప్రూవల్ కావాలని ఆయన తెలియజేశారు. 29 లే అవుట్‌లు తమ దృష్టికి వచ్చాయని కావాలంటే ఆ సర్వే నంబర్లు, ఎంత విస్తరణలో లే అవుట్ ఉందనేది అందజేస్తామని తెలియజేశారు. విద్యుత్ శాఖ ఏఈ నాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో సుమారు 2400 మంది రైతులకు సబ్సిడీ కింద విద్యుత్ అందిస్తుంటే 1800 మంది రైతులకు మాత్రమే సబ్సిడీ వస్తోందని, మిగిలిన వారు 200 యూనిట్లకు వాడుకుంటున్నారని, అందుకనే వీరికి మాత్రమే సబ్సిడీ చూపిస్తుందన్నారు. ఎంపీడీఓ కాశయ్య మాట్లాడుతూ మండలంలో రాబోయే వేసవి కాలం దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్లు కలిసి పని చేయడం వల్ల పింఛన్ పంపిణీలో జిల్లాల్లో 2వ స్థానంలో ఉన్నామని, దీనికి సంతోషమని, అందరు కలిసి కట్టుగా పని చేస్తే మండలం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కేవీ ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్యామిలీ వైద్యుల విధానం ద్వారా ప్రతి ఇంటికి వైద్యాన్ని అందిస్తున్నామని, దీని ద్వారా ప్రతి పేదవాడికి వైద్యం అందుతుందని తెలిపారు. ఎంపీపీ అల్లు సత్యవతి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రజల్లో ఎలా ఉందని, ఏ మేరకు ప్రజలకు వైద్యాన్ని అందిస్తున్నారని ప్రశ్నించారు. డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ 15 రోజుల్లో రెండు రోజులు ఆయా గ్రామాలకు వెళ్తున్నామని, చిన్న గ్రామాలు అయితే 300ల మంది, పెద్ద గ్రామాలు అయితే 500, 600 మంది వైద్యం చేయించుకునేందుకు తమ వద్దకు వస్తున్నారని, ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల ప్రతి ఇంటికి వైద్యం వెళ్తుందని సభ దృష్టికి తీసుకుని వచ్చారు. అనంతరం పంచాయతీ రాజ్ ఏఈ, ఈఓపీఆర్‌డీ, మండల విద్యాశాఖాధికారులు, ఏపీఎం, ఏపీఓ, ఐసీడీసీ సూపర్‌వైజర్లు, ఆర్‌అండ్‌బీ ఏఈ, పశువైద్యశాఖ అధికారులు వారి యొక్క అభివృద్ధిని తెలియజేశారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, మండల ఉపాధ్యక్షులు సాతులూరి బాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పాలువాయి పీఏసీఎస్ అధ్యక్షుడుగా మేకల మల్లయ్య



మల్లయ్యకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

రెంటచింతల: మండలంలోని పాలవాయి పీఏసీఎస్ అధ్యక్షుడుగా తుమ్మూరు కోట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మేకల మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోగా నియామక పత్రాన్ని ప్రభుత్వ విప్ పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ సొసైటీ ద్వారా ప్రభుత్వం అందజేసే పథకాలను ఋణాలను రైతులకు సకాలంలో అందజేసి వారికి అండగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్తు వైస్ చైర్మన్ సొంటిరెడ్డి నర్సిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పూజల రామయ్య, ఎంపీటీసీలు షేక్ జానిబషా, గుంట ముక్కంటీశ్వర్‌రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

వైఎస్సార్ సీపీ నేతలు



సచివాలయం వద్ద మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

దాచేపల్లి : వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో తంగెడలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని టీడీపీ నాయకులకు వైఎస్సార్‌సీపీ నేతలు సవాల్ విసిరారు. మండలంలోని తంగెడలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలు మంగళవారం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో తీవ్రంగా ఖండించారు. వైస్ ఎంపీపీ కందుల జాను, సర్పంచ్‌లు కొత్తపల్లి కాశయ్య, దైద నాగరాజు, చల్లగుండ్ల ఇశ్రాయేలు మాట్లాడుతూ...సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నాయకత్వంలో రూ.24 లక్షలతో వార్డు సచివాలయం, రూ.18 లక్షలతో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్, రూ. 1కోటిరూపాయలతో హైస్కూల్‌లో అదనపు తరగతి గదులు, అభివృద్ధి పనులు చేశామని, నిరుపేదలైన 407 మందికి ఇంటి స్థలాలు ఇచ్చామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కాసు సహకారంతో భవ్య సిమెంట్ యజమాన్యంతో మాట్లాడి రూ. 2కోట్లతో గ్రామం మొత్తం డ్రైనేజీలు నిర్మించామని, కోటిన్నర వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించామని నాయకులు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమ పార్టీ నాయకులతో పాటుగా టీడీపీ వారికి కూడా లబ్ధిజరిగిందని, రానున్న కాలంలో గ్రామంలో ఇంకా అభివృద్ధి పనులు చేసేందుకు ఎమ్మెల్యే కాసు చర్యలు తీసుకున్నారని వారు తెలిపారు. గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే కాసు ఇచ్చిన హామీ మేరకు రూ.100 కోట్లతో తంగెడ వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణంకు చర్యలు తీసుకున్నారని, ఈ పనులు త్వరలోనే ప్రారంభమౌతాయని వారు పేర్కొన్నారు. నీరు–చెట్టు ద్వారా టీడీపీ నాయకులు రూ.3 కోట్లు అక్రమంగా సంపాదించుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన పనులను టీడీపీ ప్రభుత్వంలో చేసినట్లుగా ప్రచారం చేసుకోవడం హాస్యస్పందంగా ఉందన్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, టీడీపీ నాయకులు వస్తే గ్రామ సచివాలయం వద్దే ప్రజల సమక్షంలో చర్చిద్దామని వైఎస్సార్ సీపీ నేతలు సవాల్ చేశారు. సమావేశంలో కో ఆప్షన్ సభ్యుడు షేక్ హుస్సేన్, పార్టీ నాయకులు దేవళ్ల వీరాస్వామి, ఆరికట్ల మల్లారెడ్డి, బీరవల్లి శౌర్రెడ్డి, గొగిరెడ్డి వెంకటరెడ్డి, వట్టి రామచంద్రారెడ్డి, భూషణం చెన్నయ్య, ఉప్పుతల నరసింహరావు, వట్టి చంద్రారెడ్డి, మాదినపాటి జానీ, షేక్ పీర్‌అహ్మద్‌గారి హుస్నే, ఉప్పుతల యల్లయ్య, పాస వెంకటేశ్వర్లు, షేక్ హుస్సేన్, గాదెవారిపల్లి సుభానీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కులు అందజేత



బీమా చెక్కులు అందజేస్తున్న మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి

వెల్దుర్తి: మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన సింగాల ఏడుకొండలు, సింగాల వెంకటేశ్వర్లు మృతి చెందారు. వీరికి మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి వైఎస్సార్ బీమా పథకం కింద రూ. 10వేల నగదును మృతుని భార్యలు మల్లేశ్వరి, నారాయణమ్మలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ బీమా కింద సహజ మరణం పొందిన వారికి రూ. లక్ష బీమాను అందిస్తున్నారు. అందులో భాగంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10వేలను అందజేయడం జరిగిందన్నారు. మిగతా సొమ్మును తరువాత అందజేస్తామన్నారు. ఈ పథకం ద్వారా వచ్చిన డబ్బును కుటుంబాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అందుగుల చంద్రయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు సింగాల వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున, నర్ర మల్లయ్య, పాలవాయి వెంకటయ్య, విజయ్‌బాబు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు మొదటి ప్రాధాన్యత

గురజాల డీఎస్పీ పల్లపురాజు



మాట్లాడుతున్న గురజాల డీఎస్పీ పల్లపురాజు

మాచర్ల: పల్నాడులో ఫ్యాక్షన్ ను అణచి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తుల పై దృష్టి సారించి రాబోయే రోజుల్లో అన్ని గ్రామాల్లో ప్రశాంతత కోసం శాంతి కమిటీలను పల్నాడు జిల్లా ఎస్పీ రవి శంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని గురజాల డీఎస్పీ పల్లపురాజు చెప్పారు. మంగళవారం పట్టణంలోని అర్బన్ స్టేషన్‌కు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇప్పటికే పాత చరిత్ర ఆధారంగా 26 గ్రామాలు సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో సమస్యలు ఎందుకు వస్తున్నాయో తెలుసుకుని క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి శాంతి భద్రతలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. గురజాల సబ్ డివిజన్ పరిధిలో 11 పోలీసు స్టేషన్‌ల పరిధిలో నేర చరిత్ర ఆయా గ్రామాల్లో ఎలా ఉంది. దీనికి కారకులెవరూ అనే విషయంతో పాటు ప్రజలతో మమేకమై పోలీసులకు సహకరించాలని వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు టౌన్ నుంచి గురజాల డీఎస్పీగా బదిలీపై వచ్చినట్లు పల్లపురాజు తెలిపారు. శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీపడనని, ప్రతి గ్రామాన్ని సందర్శించి సమస్యల పై అవగాహన కల్పించి సిఐ, ఎస్‌ఐలతో కలిసి గ్రామాలను సందర్శించి పోలీసు శాఖ ద్వారా పరిష్కరించాల్సిన సమస్యల పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సమావేశంలో అర్బన్ సీఐ బాలకృష్ణ పాల్గొనగా ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ బాలకృష్ణ, రూరల్ సీఐ షేక్ షమీముల్లా, ఎస్‌ఐలు అరుణ, రంగారావు, సుందర రాజన్, రాజశేఖర్, అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీహరిలు డీఎస్పీని కలిసి పూల బొకెలు అందించి, శాలువలతో సత్కరించారు.

మాచవరం మండలంలో భారీ వర్షం




మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు వర్షం కురవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. కల్లాల్లో ఉన్న మిర్చి, వరి పంటలను కాపాడుకునేందుకు రైతులు సిల్పాలిన్, టార్పలిన్ పట్టలతో పరుగులు తీసారు. అనేక చోట్ల పంటదశలో ఉన్న వరి పైర్లు నేలకు ఒరిగాయి. అకస్మికంగా వీచిన పెను గాలులకు బొప్పాయి, జామ పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. వర్షాలకు ఎలాంటి ఆస్థి నష్టం కానీ, ప్రాణ నష్టం గానీ జగరలేదని అధికారులు తెలిపారు.

క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో రాణించాలి



మాచర్ల: గుంటూరు ఉమ్మడి జిల్లాలో సాఫ్ట్ బాల్ క్రీడల ఎంపిక పట్టణంలోని సాగర్ రోడ్డులో గల సెయింటాన్స్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు ప్రారంభిస్తూ 10వ విడత మాచర్ల పట్టణంలో పాఠశాలలో సెలక్షన్ చేయడం ఎంతో సంతోషకరమని పాఠశాల ప్రిన్సిపల్ రాయల మేరి అన్నారు. మంగళవారం పోటీలను ప్రారంభించి క్రీడా పోటీలను స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ ప్రతిభ చూపాలని కోరారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి 150 మంది విద్యార్థులు సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26,27,28 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు సాఫ్ట్ బాల్ కార్యదర్శి శివపార్వతి తెలిపారు. ఈ పోటీలకు నిర్వాహకులుగా జిల్లా సాఫ్ట్ బాల్ వైస్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్, పుణ్యాల నరసింహారెడ్డి, సిస్టర్ కుమార్, పి బాలకృష్ణ, వెంకట్రావు, పిఈటి ప్రతాప్‌లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



దుర్గి: దుర్గి సెంటర్‌లో మండల గ్లోరీ జీసస్ పాస్టర్స్ ఫెలోషిప్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం స్థానిక తహసీల్దార్ జి రమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవకులు దైవ సేవతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎ జానయ్య, వైస్‌ప్రెసిడెంట్ స్వర్ణన రాజు, ట్రెజరర్ పి అన్నారావు, గౌరవ అధ్యక్షుడు ఎం చెంద్రపాల్, పాస్టర్ రమేష్ శామ్యూల్, పలువురు సేవకులు గ్లోరీ జీసస్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ.. ఆరోగ్యం పదిలం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ బిలాలుద్దీన్

దాచేపల్లి : కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మరక్షణతో పాటుగా ఆరోగ్యానికి మంచిదని దాచేపల్లి సీఐ షేక్ బిలాలుద్దీన్ అన్నారు. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో పూలే పౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ఏర్పాటు చేసిన కరాటే శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ బిలాలుద్దీన్ మాట్లాడుతూ..కరాటే నేర్చుకోవడం వల్ల శరీరం ధృడంగా ఉంటుందని, అనారోగ్య సమస్యల నుంచి తప్పించుకోవచ్చునని చెప్పారు. పూలే పౌండేషన్ ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ కోట కొండలు, ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, పౌండేషన్ అధ్యక్షుడు మీసాల అచ్చయ్య, ఉపాధ్యక్షుడు కె. కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి ప్రవీణ్, స్థానికులు వినుకొండ సుధీర్‌కుమార్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు

జెడ్పీ వైస్‌చైర్మన్ శౌంటిరెడ్డి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ శౌంటిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను(ఫలాలు) అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంటిరెడ్డి నర్సిరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ షేక్ గౌసియాబేగం అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామీణులకు మెరుగైన వైద్యసదుపాయం కల్పించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తలపెట్టారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఏలాంటి పక్షపాతానికి తావు ఇవ్వద్దని లబ్ధిదారులకు సకాలంలో సంక్షేమ ఫలాలు అంధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి ప్రతి ఒక్క అధికారి తమ పరిధిలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకుపోవడానికి కృషి చేయాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, పీఆర్ ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేంద్రారెడ్డి, ఈఓపీఆర్డీ రామచంద్రరావు, ఆర్‌ఐ రాజశేఖర్ నాయక్, పంచాయితి కార్యదర్శులు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహేంద్రస్వామి తిరునాళ్ల



పూజలు అందుకున్న గోవిందమ్మతో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారు

పశర్లపాడు(రెంటచింతల) : మండలంలోని పశర్లపాడులో వేంచేసిఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ తిరుణాళ్ల వేడుకల్లో భాగంగా మంగళవారం ఆలయ అర్చకులు గొట్టిముక్కల లక్ష్మీనారాయణ నేతృత్వంలో మహానైవేద్యం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గోవిందమ్మ సమేత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివార్లకు వేకువజాము నుంచే వివిధ రకాల అభిషేకాల తోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. గ్రామస్తులందరూ కూడా కులమతాలకు అతీతంగా ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ తోరనాలతో అందంగా అలంకరించారు. ఆలయం సమీపంలో ఏర్పాటు చేస్తున్న 4 భారీ విద్యుత్ ప్రభలతో వైభవంగా జరిగింది.

ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రత్యేక పూజలు..

ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గోవిందమ్మ సమేత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో శాంతియుతమైన వాతావరణంతో గ్రామస్తులు ప్రశాంతంగా జీవించాలని, పాడిపంటలు సంవృద్ధిగా పండి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివార్లను కోరుకున్నట్లు పీఆర్కే తెలిపారు.

దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్టకు ఏర్పాట్లు



ప్రతిష్ట మహోత్సవానికి సిద్ధమైన శివాలయం

మిట్టగుడిపాడు(రెంటచింతల): మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో స్వస్తిశ్రీ వ్యవహారిక చాంద్రమానేన శ్రీ శోభకృత్ నామ సంవత్సర వైశాఖమాస శుద్ధ త్రయోదశి సందర్భంగా ఈ నెల 3న దయం గం.8.15 ని,,లకు నాగేశ్వరస్వామి ఆలయంలో పార్వతి, గణపతి, సుబ్రమణ్యేశ్వర, చండీశ్వర, నందీశ్వర, శిఖర కలశస్థాపన, వీరాంజనేయ స్వామి ఆలయంలో గణపతి, ఒంటెవాహనం, శిఖరం, రామాలయంలో పంచకలశముల ప్రతిష్ట మహోత్సవం త్రయోహ్నిక దీక్షతో యాగశాల పరస్పరముగా జరుపుటకు దైవజ్ఞులచే నిర్ణయించిన నేపద్యంలో బుధవారం దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవానికి సిద్ధమైనట్లు సర్పంచ్ గొట్టం ప్రమీలగురవారెడ్డి మంగళవారం తెలిపారు. బ్రహ్మశ్రీ సాగి నరసింహమూర్తి, బ్రహ్మశ్రీ వెల్లటూరి నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో దేవతామూర్తుల విగ్రహాలను 20 మంది ఋత్వికులు వేదమంత్రాల మధ్య ఏర్పాటు చేయనున్నారు. ఆలయాలను తోరణాలతో, రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలంకరించడంతో కొత్త సొగస్సును సంతరించుకున్నాయి. గ్రామ ప్రజల సహకారంతో చేపట్టిన ఈ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

ఎంఈఓ రాజు



పిడుగురాళ్ల: అనుమతులు లేకుండా ప్రైవేటు పాఠశాలలు నిర్వహిస్తే అటువంటి పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పిడుగురాళ్ల ఇన్‌చార్జి ఎంఈఓ ఒంగులు రాజు హెచ్చరించారు. పట్టణంలోని విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ రాజు మాట్లాడతూ పిడుగురాళ్ల పట్టణం, మండలంలో 30 ప్రైవేటు పాఠశాలకు అనుమతులు ఉన్నాయని తెలిపారు. తుమ్మల చెరువులోని ఓ ప్రైవేటు పాఠశాలకు మాత్రం అనుమతులు రాలేదని, అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహిస్తే ఉన్నతాధికారులతోహాజరై పాఠశాలను సీజ్ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అలాగే పిడుగురాళ్ల పట్టణం, మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 55 ఉన్నాయని, నాడు నేడు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పాఠశాలను అభివృద్ధి చేసి విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేసింది. అంతేకాకుండా విద్యా వ్యవస్థలో పలు మార్పులు తీసుకుని వచ్చి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల కన్నా మిన్నగా, మెరుగైన విద్యను అందించేందుకు అర్హత కలిగిన ఉపాధ్యాయ బృందం ఉందని, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు.

నేడు రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ క్లీనిక్, పాలకేంద్రం ప్రారంభోత్సవం

రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడులో నూతనంగా నిర్మాంచిన రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ క్లీనిక్, పాలకేంద్రాలను బుధవారం ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు పీఆర్ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో రూ.21.80 లక్షల నిధులతో వైఎస్సార్ రైతుబరోసా కేంద్రం, రూ.17.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, రూ. 15.74 లక్షలతో నిర్మించిన పాల కేంద్రాలను ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను, గ్రామాల్లోనే ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి వైఎస్సార్ క్లీనిక్‌లను, పాడిరైతులకు ఆదుకునేందుకు పాలకేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో ఇప్పటి వరకు మండలంలో మొత్తం 13కు గాను 12 గ్రామ సచివాలయాలు, 13కు గాను 13 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు నిర్మాణం పూర్తి అయి ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. తుమ్మకోట గ్రామంలో సచివాలయానికి కేటాయించిన స్థలం కోర్టు వివాదంలో ఉన్న కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు.

మజ్జిగ చలివేంద్రం

పిడుగురాళ్ల: వేసవి కాలం సందర్భంగా ప్రజలు దాహార్తిని తీర్చేందుకు పట్టణంలోని శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని మన్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలోని శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మజ్జిగ పంపిణీ చేయటం వలన పాదాచారులు, చుట్టు పక్కల ఉన్న హాస్పటల్ రోగులు సైతం ఉపయోగించుకునే విధంగా ఉందని ఆయన తెలియజేశారు.